ఎంపీ మాగుంటకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-దొనకొండ: ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డికి ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్న కుమారి దేవానంద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కోవిడ్ సమయం నుండి రైల్వేపరంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్న దొనకొండ మండల ప్రజల సమస్యలను జీఎం అరుణ్ కుమార్‌జైన్‌కు నివేదించాలని కోరిన వెంటనే దొనకొండకు విచ్చేశారని, జీఎం దొనకొండకు చేరుకోవటం కొన్ని గంటలు ఆలస్యమైనప్పటికీ తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి ఎదురు చూడటం, స్టేషన్ అభివృద్ధి, సమస్యలను జీఎంకు వివరించి పరిష్కరించాలని కోరి ప్రజా సమస్యలకై నిలబడటంపై ప్రజలు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ నిధులతో మండల అభివృద్ధికి సహకారం అందించాలని వారు ఎంపీ మాగుంటను కోరారు.

విశాలాంధ్ర
ప్రకాశం, బాపట్ల జిల్లాలు

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

- గోడపత్రిక ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-దర్శి : రాజమండ్రిలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరుగు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ 7వ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక కురిచేడు రోడ్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంతంలో గోడ పత్రికలను కె.చిన్నాంజనేయులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎమ్.రమేష్ బాబు ఏఐటీయుసి నాయకులు ఆవిష్కరణ చేశారు. రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ పథకం సంక్షేమం నిధులను దారి మళ్లింపువల్ల భవననిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులకు గురిఅవుతున్నారని అన్నారు. ఇసుక సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరుణానిధి, జూపల్లి కోటేశ్వరావు పాల్గొన్నారు.

సైన్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర-అద్దంకి : స్థానిక ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు 60 రకాలు ప్రాజెక్టులు తయారు చేసి తమ ప్రతిభ కనబరచారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు బుధవారం పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ప్రధానోపాధ్యాయులు పివి.రాఘవరావు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బహుమతులు సమకూర్చిన దాత మారెడ్డి శివారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పేరం సుధాకరరెడ్డి, ఉపాధ్యాయులు సుంకర శ్రీదేవి, మండవ నాగేశ్వరరావు, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

అండర్-19 కబడ్డీ జట్ల ఎంపిక

విశాలాంధ్ర-చీరాల : ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పందొమ్మిది సంవత్సరాల లోపు అనగా 1-1-2004 సంవత్సరం తరువాత జన్మించిన బాయ్స్, గర్ల్స్‌కు కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల నందు శుక్రవారం ఉదయం పదిగంటలకు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదినారాయణ తెలిపారు. ఇందులో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రీడాకారులు ఇంటర్మీడియట్ చదివేవారు మాత్రమే చరవాణీ నంబర్ 9949722791, 8712200224ని సంప్రదించాలని తెలిపారు.

రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర-కురిచేడు : మండలంలోని కల్లూరు గ్రామ రైతు భరోసా కేంద్రం నందు బుధవారం మండల వ్యవసాయ అధికారి కే.ప్రకాశరావు ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలుపై సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2022లో వరి పంట పండించిన నా దగ్గర నుండి సమీప రైతు భరోసా కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ జరుగుతుందని తెలియజేశారు. ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధర ప్రకారం సాధారణ రకం 100 కేజీలు 20:40 రూపాయలు గ్రేడ్ ఏ రకం 100 కేజీలు 20 60 రూపాయలుగా ఉంటుందని తెలిపారు అయితే కనీస మద్దతు ధరకు అమ్మాలంటే ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల ప్రకారం అనగా చెత్తా చెదారం మట్టి పిల్లలు వ్యర్థ పదార్థములు ఒక శాతం మించకూడదని తేమ శాతం 17 మించకూడదని చెడిపోయి పురుగు తిన్న ధాన్యమును ఐదు శాతం కంటే మించకూడదని తెలియజేశారు. గ్రామ సర్పంచి నక్క రామకృష్ణ కాశీపురం గ్రామ సర్పంచి సాధన నాసరయ్య మండల అడ్వైజ్ మెంబర్ గురునాథం వివిఏ టి అనిల్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమావేశం

విశాలాంధ్ర-సీఎస్‌పురం :

మండల తెలుగుదేశం పార్టీ సమావేశం ఈ నెల 24వ తేది గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో జరుగుతుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు (వెంగయ్య) తెలిపారు. కనిగిరి టీడీపీ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశంలో మండల పరిధిలోని క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలు, గ్రామ కమిటీ అధ్యక్షులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా పదవులు పొందిన టీడీపీ నాయకులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని కావున మండలంలోని తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాలు, నాయకులు, కార్యకర్తలు, అభి మానులు పాల్గొనాలని వెంకటేశ్వర్లు కోరారు.

ప్రతివారం పురోగతి కనిపించాలి

- ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణాల్లో వేగం పెంచండి
- కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ :

ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణ పనులలో ప్రతివారం స్పష్టమైన పురోగతి కనిపించాలని జిల్లా కలెక్టరు ఏ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. ఈ దిశగా ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్కు, బిఎంసియుల పనులపై బుధవారం కలెక్టరేట్ హాలులో సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. మండలాల వారీగా వీటి పురోగతిపై ఆయన ఆరా తీశారు. వీటి నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పర్యవేక్షించాలని కలెక్టరు ఆదేశించారు. ఈ భవనాల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు భూమి కేటాయించినప్పటికీ కొన్ని చోట్ల పనులు ప్రారంభించకపోవడంపై కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల లోని స్థానిక పరిస్థితులు, స్థానికంగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోగా స్థానికేతరులు పనులు చేపట్టడానికి కూడా వీరు అడ్డుతగులుతున్నారని అధికారులు కలెక్టరు దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఇలాంటి సందర్భం ఎదురైతే బాధ్యులపై పోలీసు కేసు నమోదు చేయాలని ఆదేశించారు. కోర్టు కేసులు ఉన్న చోట మినహాయించి ఇతర గ్రామాలలో వీటి నిర్మాణాలు చురుగ్గా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. పాల ఉత్పత్తి అధికంగా ఉన్న ప్రాంతాలలో బి.ఎం.సి.యు.ల నిర్మాణాలను కూడా త్వరగా పూర్తి చేసేలా దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు ప్రజా ప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఎస్‌ఈ కొండయ్య, ఈ.ఈ.లు, డి.ఈ.ఈ.లు, ఏ.ఈ.ఈ.లు పాల్గొన్నారు.

కనిగిరిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంతో ప్రజాసంఘాల నాయకులు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం అర్ధరాత్రి ప్రజా సంఘాల నాయకులు పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్‌లోని రేషన్ షాప్ నుంచి బియ్యాన్ని అక్రమార్కులు తరలిస్తున్నారని సమాచారంతో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కేశవరావు లారీల్లో తరలిస్తున్న 150 బస్తాల రేషన్ బియ్యాన్ని నిఘావేసి పట్టుకున్నారు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫోన్ ఆఫ్ చేసుకున్నారని ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. వైసిపి నాయకుల కనుసన్నల్లో అక్రమ రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా కొనసా గుతుందని ఆరోపిస్తున్నారు. లారీ డ్రైవర్ పరారు కావడంతో లారీలో ఉన్న 150 బస్తాల రేషన్ బియ్యాన్ని సంబంధిత అధికారులకు అప్పగించారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

విశాలాంధ్ర-చీరాల : చీరాల ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం హెచ్‌సిజీ ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ సెంటర్ ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ చీరాల వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని హెచ్ సిజి ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శరత్ బాబు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి విచ్చేసేవారు ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటలలోపు హాజరు కావాలని పాత డాక్టర్ రిపోర్టు ఉంటే తీసుకొని రావాలని ఈ వైద్యశిబిరానికి డాక్టర్ వై.శివరామకృష్ణారెడ్డి హాజరవుతారని అన్నారు. చీరాల పురప్రజలు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని పూర్తి సమాచారం కొరకు చరవాణీ నెంబర్- 9652066322, 7416217474 లను సంప్రదించాలని అన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-చీరాల : డాక్టర్ లలిత చిక్కాల తృతీయ వర్ధంతి సందర్భంగా బుధ, గురువారాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, హాస్పిటల్ సిఈఓ సిఎన్ ఫ్రెడ్రిక్ తెలిపారు. గురువారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు, స్పెషలిస్ట్ డాక్టర్చే అత్యాధునిక పరికరాలతో ప్రొసీజర్ చేస్తారని, మందులు ఉచితంగా ఇచ్చి, రక్త పరీక్షలు తగ్గింపు ధరలతో చేస్తారని, వెల్లడించారు. బేర్ క్రిస్టియన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం గురువారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిఎన్ ఫ్రెడ్రిక్ మాట్లాడుతూ ఈ మెగా వైద్య శిబిరంలో డాక్టర్ శామ్యూల్ పాల్ ప్రదీప్ కొండ, డాక్టర్ షరణ్య సంజీవ్, డాక్టర్ షైనీ సైమన్, డాక్టర్ బెన్ రోషన్ ఈద, డాక్టర్ ఐరిన్ జి డేవిడ్‌లు పాల్గొంటారని ఈ వైద్య శిబిరంలో పాల్గొనే ప్రజలు, తమ పేర్లు ముందుగా ఓపి నందు, నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఎస్సీల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-కనిగిరి : ఎస్సీ ఎస్టీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 28వ తేదీ ఒంగోలులో కలెక్టర్‌కి మెమోరాండం ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఎస్సీ ఎస్టీ సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా పూర్తిగా నిలుపుదల చేసి కేంద్రం నుంచి వస్తున్న సబ్ ప్లాన్ నిధులను సైతం ఇతర పథకాలకు వినియోగించుకుంటూ ఎస్సీ ఎస్టీలకు మొండి చేయి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం పాత పథకాలను యథావిధిగా కొనసాగించాలని కలెక్టర్లకు మెమోరాండం ఇచ్చు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సర్పంచుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి

- నిర్లక్ష్యం వహిస్తే మూల్యం తప్పదు
- అందరికీ సంక్షేమం అంటూ సర్పంచులుకు సంక్షోభం
- సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : రాష్ట్రంలో గ్రామ పంచాయితీలలో నెలకొంటున్న ఆర్థిక సంఘం నిధుల సంక్షోభం, ఇతర అభివృద్ధి పనులకు రావలసిన బిల్లులపై సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న తీరు విడనాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరి దుర్మార్గంగా ఉన్నదనీ, కొన్ని నెలలుగా సర్పంచులు అనేక విధాలుగా తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ చేస్తున్న నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. తొంబై శాతం సొంత పార్టీ సర్పంచుల గోడు వినని ముఖ్యమంత్రి తీరు చూస్తుంటే ఇదేనా ప్రజాస్వామ్యం అన్నట్టుం దని అన్నారు. అందరికీ బటన్ నొక్కి కోట్లాది రూపాయలు సంక్షేమం పేరిట పంచుతున్న ముఖ్యమంత్రి పంచాయితీలలో మాత్రం రివర్స్ బటన్‌తో నిధులు నొక్కేసి సంక్షోభంలోకి నెట్టేస్తున్నా రన్నారు. దీనిపై పంచాయితీ రాజ్ మంత్రి బూడి ముత్యాల నాయుడు తన శాఖలో పెరుగుతున్న సర్పంచుల అసంతృప్తిపై స్పందించి సమస్యల పరిష్కారానికి సర్పంచులతో సమావేశం ఏర్పాటు చేయాలని వీర భద్రాచారి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పంచాయితీ వ్యవస్థ ఉన్నదా? లేదా? అన్న చందంగా పాలన ఉన్నదని ఎద్దేవా చేశారు. అధికారుల పాలనలో పంచాయతీ వ్యవస్థ అవస్థల పాలవుతుందనీ తక్షణం మంత్రి, ముఖ్యమంత్రి చొరవ చూపాలని లేఖలో కోరినట్లు వీర భద్రాచారి తెలిపారు. సర్పంచుల సంఘం నాయకులు మన్నం శ్రీనివాస్, రమణారెడ్డి, ప్రభాకర్, మోహనరెడ్డి పాల్గొన్నారు.

చిల్లచెట్లు తొలగింపు

విశాలాంధ్ర-తర్లుపాడు : మండలంలో ప్రజా సమస్యలను తీర్చేందుకు గ్రామ ప్రథమ పౌరులు ముందుండి సమస్యలు తీర్చవలసి ఉండగా వారికి ప్రభుత్వం నుండి ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో చేతులెత్తేయడం జరిగింది. దీంతో మీర్జాపేట, గొల్లపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు చిల్లచెట్లతో రహదారులన్నీ మూసుకుపోవడంతో వాహనదారులకు, ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉండడంతో భయాందోళనకు గురి కావాల్సి వచ్చింది. దీంతో ఆయా గ్రామస్తులు కొందరు స్వచ్ఛంద సంస్థలను ఆశ్రయించడంతో మార్కాపురం పట్టణానికి చెందిన ఇండ్ల ఫౌండేషన్ చైర్పర్సన్ ఇండ్ల వెంకట రవి కుమార్‌రెడ్డి స్పందించి ఆయన ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చిల్ల చెట్లను జెసిబి సహకారంతో తొలగించడం జరిగినది. దీంతో ప్రయాణికులు, వాహనచోధకులు సంస్థ వారిని అభినందించారు. ఇండ్ల ఫౌండేషన్ చైర్పర్సన్ ఇండ్ల వెంకట రవికుమార్‌రెడ్డి, తాడివారిపల్లి ఎస్‌ఐ పి ముక్కంటి, సంస్థ సభ్యులు భాస్కర్‌రెడ్డి, మదిరే శివారెడ్డి, కె తిరుపతిరెడ్డి, ఆకుల శ్రీను పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గృహ నిర్మాణాల లబ్ధిదారులకు నిర్మాణ స్థాయిని బట్టి తక్షణమే బిల్లులు చెల్లించాలని గృహ నిర్మాణ శాఖ డిఈ డి.నిరీక్షణరావు అన్నారు. స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వేముల, నాయుడుపాలెం, పూరిమెట్ల, తమ్మలూరు గ్రామాల్లో జగనన్న కాలనీలో భాగంగా ఇల్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. లబ్ధిదారుడు నిర్మాణం మొదలు పెట్టిన వెంటనే దసలవారీగా బిల్లు చేయాలన్నారు. అనంతరం వేముల 41 ఇండ్లు పూరిమెట్ల 45 తమ్మలూరు 19 నాయుడుపాలెం 23 ఇళ్లను పరిశీలించారు. అందులో పూరిమెట్లలో 11 ఇల్లు బేస్ మట్టంలో ఉన్నాయి. వేములలో 5 ఇండ్లు బేస్ మట్టంలో ఒక ఇల్లు స్లాబ్ లెవల్‌కి వచ్చిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హనుమంతరావు, వర్క్ ఇన్స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాల్లోనే వరి ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర-తర్లుపాడు : మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీలోని మేకలవారిపల్లి గ్రామాలలో ఏఓఆర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలుపై రైతులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏడిఏ రమాదేవి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2022లో వరి పంట పండించిన రైతుల దగ్గరి నుంచి, సమీప రైతుభరోసా కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధర ప్రకారం సాధారణ రకం 100 కేజీ లు 2040 రూపాయలు. గ్రేడ్-ఏ రకం 100 కేజీలు 2060 రూపాయలు ఉంటుందని తెలిపారు. అయితే కనీస మద్దతు ధరకు రైతులు ధాన్యం అమ్ముకోవాలంటే, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల ప్రకారం అనగా చెత్తాచెదారం, మట్టి పెల్లళ్ళు, వ్యర్థ పదార్థాలు 1 శాతం మించకూడదని, తేమ లేక నెమ్ము 17 శాతం మించకూడదని, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5శాతానికి మించకూడదనేటువంటి నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న వరి ధాన్యాన్నే కొనుగోలు చేస్తారని, ఈ -క్రాప్‌లో నమోదు అయ్యి, ఈ కేవైసీ చేయించుకొని ప్రభుత్వ మద్దతు ప్రకారం అమ్మలనుకొనే రైతు వద్ద నుండే ధాన్య సేకరణ జరుగునని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ రమాదేవి, ఏవో ఆర్ చంద్రశేఖర్, వీఏఏలు గ్రామ రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతంపై చర్యలు హర్షణీయం

విశాలాంధ్ర-ఒంగోలు : వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం కాకుండా తీసుకుంటున్న చర్యల పట్ల హ్యూమన్ రైట్స్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఖలీఫాతుల్లా హర్షణీయమన్నారు. బుధవారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ వి.ఖాదర్ బాషాని విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ వైస్ ప్రెసిడెంట్ షేక్. ఖలీఫాతుల్లాబాషా కలిసి పలు విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా తీసుకొంటున్న చర్యలు హర్షణీయమని ఛైర్మన్‌ను అభినందించారు. వక్ఫ్ బోర్డుకు చెందిన దర్గాల, మసీదుల, అంజుమాన్ కమిటీలలో, ముతవల్లిల నియమకలలో మిగతా కమిటీలలో జరిగిన అవకతవకలను సరిచేసే ప్రయత్నం చేస్తుంటే ఛైర్మన్ ఖాదర్ బాషాపై విమర్శలు చేయడం బాధకారం అని షేక్. ఖలీఫా తుల్లా బాషా అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ బోర్డు సంబంధించిన అభివృద్ధి కార్య క్రమా లకు ముస్లిం సమాజం అండగా నిలిచి తమ వంతు సహకారం అందించాలని కోరారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరుపున వక్ఫ్ బోర్డు తరుపున చేసే అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని ఛైర్మన్ ఖాదర్ బాషాకు తెలిపారు.

గడపగడపకు ప్రభుత్వ పథకాల ప్రచారం

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని భోగనంపాడు గ్రామం నందు బుధవారం మండల యువజన నాయకుడు పిల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గడపగడప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరికూటి అశోక్ బాబు మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా, అభివృద్ధి చేయడమే జగనన్న ఉద్దేశమని అన్నారు. రాష్ట్రంలో జగనన్న పాలనలో అర్హులందరికి నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. వివిధ సంక్షేమ పథకాల్లో నెలకొన్న సాంకేతిక ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరగా వీటికి సంబంధించి వాస్తవ పరిస్థితిని అర్హతలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు ఎంపీడీవో రత్న జ్యోతి భోగనంపాడు సర్పంచి బడుగు సత్య ఫీల్డ్ అసిస్టెంట్ కొండలరావు డీలర్ కాంతారావు సర్పంచి మార్తాల వెంకటేశ్వర్‌రెడ్డి సర్పంచ్ షేక్ చిన్న మస్తాన్ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి డీలర్ రూబేన్ ఫీల్డ్ అసిస్టెంట్ డేవిడ్ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరిస్తున్న వరికూటి అశోక్ బాబు

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర-జెపంగులూరు :

జెపంగులూరు మండలంలోని పంగులూరు, అరికట్లవారిపాలెంలో జరిగిన దొంగతనాలను ఛేధించి 60 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక సామ్ సంగ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం సెప్టెంబర్ 18వ తేదీన పంగులూరులో జరిగిన దొంగతనంలో 36గ్రాముల బంగారం, నవంబర్ 11వ తేదీన ఆరికట్లవారి పాలెంలో జరిగిన దొంగతనంలో 24గ్రాముల బంగారం చోరికి గురయినట్టు తెలిపారు. ఈ రెండు చోరీ కేసులను సీరియస్‌గా తీసుకున్న బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ శ్రీకాంత్, పర్యవేక్షణలో అద్దంకి సిఐ ఎం.రోశయ్య, పంగులూరు ఎస్‌ఐ తిరుపతిరావు పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచారు. ఈ సమయంలో రెణింగవరం జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా ఒక వ్యక్తి తిరుగుచున్నడని సమాచారం అందుకున్న పంగులూరు యస్‌ఐ తన సిబ్బందితో కలిసి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, పంగులూరు గ్రామానికి చెందిన కీర్తిపాటి చెన్నకేశవులు (29) అలియాస్ చెన్నయ్య, తండ్రి పుల్లయ్య, ఈ రెండు చోరీలు తనే చేసినట్టు అంగీకరించాడు. అతని వద్ద నుండి చోరీ సొత్తును సుమారు 60 గ్రాముల బంగారం, ఒక సాంసంగ్ ఫోను వీటి విలువ సుమారు రూ 2,56,000ను స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసుని ఛేదించిన అద్దంకి రూరల్ సీఐ యం. రోశయ్య, పంగులూరు యస్‌ఐ తిరుపతిరావు, హెడ్ కానిస్టేబుల్ యం కోటేశ్వరరావు కానిస్టేబుల్ సి హెచ్. రతన్‌రాజు, యం. వెంకటరెడ్డి, కె. విజయ్ కుమార్‌లను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా ఇతర ప్రాంతాలకు, బంధువుల వద్దకు, పండుగలకు, దైవ దర్శనానికి వెళ్ళేటప్పుడు మీ గ్రామంలోని మహిళా సంరక్షణ కార్యదర్శికి లేదా మీ పరిధిలోని పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇస్తే, పోలీసులు మీ ఇండ్ల పై నిఘా ఉంచుతారని తెలిపారు.

రికవరీ సొత్తుతో ఎస్ఐ, పోలీసులు

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికీ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. బేస్తవారిపేట పట్టణంలోని సచివాలయం - 2, మండలంలోని నేకునాంబాద్ గ్రామాలలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తుందని, ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోమౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తూ రూ. 20 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జడ్పీటీసీ బండ్లమూడి వెంకటరాజు, వైస్ ఎంపీపీ డి. ఖాజామియా, బీపేట ఉప సర్పంచ్ మట్టా రమేష్, నేకునాంబాద్ సర్పంచ్ దానమ్మ, వైసీపీ నాయకులు ప్రేమానంద్, ఎంపీటీసీలు, సర్పంచ్ లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే

తటాకంలా ప్రధాన రహదారి

రోడ్డుపై నీరు చేరడంతో ఇక్కట్లు పడుతున్న వాహనదారుడు

విశాలాంధ్ర-తాళ్లూరు : అది గ్రామం నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి. గ్రామ ప్రజల ప్రయాణ సౌకర్యం కోసం తారుతో నిర్మించిన ప్రధాన రహదారి. అయితే అలాంటి రహదారి నీరు చేరి తటాకం లాగా తయారైంది. ఇలాంటి దుస్థితి మండలంలోని లక్కవరం గ్రామంలో చోటుచేసుకుంది. లక్కవరం గ్రామ ప్రజలు ప్రతిరోజు వివిధ పనుల నిమిత్తం తూర్పు గంగవరం, నియోజకవర్గ కేంద్రమైన దర్శికి వెళు తూ ఉంటారు. అయితే గ్రామ శివారులో ప్రధాన రహదారి వర్షపు నీరు చేరి తటాకం లాగా దర్శనమిస్తుంది. సైడ్ కాలువలు లేకపోవడం తో వర్షపు నీరంతా ఎటు వెళ్లే అవకాశం లేక రోడ్డుపై చేరి మోకాలు లోతు నీటితో నిండిపోయి ఉంది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల నీరంతా నిలిచి ఉండడమే కాక ఆ నీరంతా రంగు మారి పచ్చదనంగా మురికి పట్టి పాచి పట్టినట్లుగా తయారైంది. దీనితో ప్రధాన మార్గంలో నడవాలంటే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామం నుండి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రతి ఒక్కరూ ఇటు నుండి ప్రయాణించవలసిందే. దీంతో ప్రజలు, మహిళలు, వృద్ధులు, పిల్లలు, దేవాలయానికి వెళ్లే భక్తులు అనేక వ్యయప్రయాసాల కోర్చి,ఈ మార్గం ద్వారానే ప్రయాణించవలసి వస్తుంది. ఇక వాహనదారుల పరిస్థితి వర్ణణాతీతం. ఇదే కాకుండా నీరంతా ఒకచోట చేరడంతో మురికి పట్టిన నీటి వల్ల దోమల సంఖ్య అధికమై సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం కూడా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఈ చెడు స్థితి నుండి రహదారిని కాపాడి, ప్రజల బాధలు, అవస్థలు తీర్చాలని కోరుతున్నారు.

నీరు చేరి చెరువులా కనిపిస్తున్న రోడ్డు

టీడీపీ విజయానికి కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే ఉగ్ర పిలుపు

విశాలాంధ్ర-కనిగిరి : టీడీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్చార్జ్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం కర్నూలులో కనిగిరి ప్రాంతం నుంచి వలస వెళ్లిన వారితో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఉగ్రను ఘనంగా సన్మానించారు. ఉగ్ర మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సంసిద్ధంగా ఉండాలని, టీడీపీ సానుభూతిపరులు ఎక్కడ ఉన్నా ఎన్నికల రోజు ఓటింగ్‌కు వచ్చి సహకరించాలని కోరారు. పామూరు మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఒంగోలు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు ఏలూరు వెంకటేశ్వర్లు, తిరువీధి కేశవులు, దారపనేని చెన్నయ్య, కిషోర్, చెరుకూరి శ్రీకాంత్, రమేష్, చెంచులు, సుబ్బారాయుడు, సురేష్, తిరుపతియ్య, నరసింహ, భాస్కర్ పాల్గొన్నారు.

శ్రద్ధా వాకర్‌కి నివాళి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన శ్రద్ధా వాకర్ హత్యోదంతాన్ని నిరసిస్తూ ప్రకాశం జిల్లా కంభం పట్టణంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కంభం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థులు, స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మరియు పట్టణంలోని పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొని ర్యాలీకి సంఘీభావం ప్రకటించారు. పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహిస్తూ స్థానిక బస్టాండ్ లో మానవహారంగా ఏర్పాటై మౌనం పాటించారు. శ్రద్ధా వాకర్ హత్యను,ఆమె మృతదేహాన్ని ముక్కలు చేసిన తీరును నిరసిస్తూ ఆమెకు శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. ఎంపీపీ చెగిరెడ్డి తులసమ్మ, లైయన్స్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పులి శ్రీనివాస ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు షాలెంరాజ్ పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రేపు అనగా ఈ నెల 25వ తేదీ శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఎం మురళీకృష్ణ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఆర్ జనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష జరుగు తుందన్నారు. జడ్పిటిసి సభ్యుడు ఎంపీటీసీ సభ్యులుగ్రామ పంచాయతీ సర్పంచులు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

సున్నా వడ్డీ పంట రుణాల లబ్ధిదారుల లిస్టు ప్రదర్శన

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండలంలోని సానికవరం గ్రామ సచివాలయం నందు సర్పంచి అధ్యక్షతన వైయస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల బెనిఫిట్స్ లిస్టును బుధవారం ప్రదర్శించడం జరిగింది. అందులో అభ్యంత రాలు ఏమైనా ఉన్నచో రైతు భరోసా కేంద్రం అధికారినికి తెలియజేయాలని కోరారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఇదేవిధంగా ప్రదర్శించి ఉన్నారని, రైతులకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్న రైతు భరోసా కేంద్రంలో తెలియజేసిన గ్రీవెన్స్ పెట్టబడుతుంది. రైతు భరోసా, పిఎం కిసాన్ రాకుండా ఉన్నవారు కొత్తగా అప్లై చేసు కోవచ్చును, పిఎం కిసాన్ వివిధ కారణాల వలన నిలిప బడినవారు రైతు భరోసా కేంద్రం నందు జిరాక్సులు ఇచ్చినచో రిలీజ్ చేపించబడుతుంది. ఈ సమావేశంలో సానికవరం సర్పంచ్ మూల రమణారెడ్డి, మండల వ్యవసాయ అధికారిని బుజ్జీ బాయి గ్రామ వ్యవసాయ/ఉద్యాన సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని రాచర్ల రోడ్డులో ఆది ఆంధ్ర ఎడ్యుకేషనల్ సొసైటీ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో వైఎస్ఆర్సిపి నాయకులు బాలు సతీమణి వెంకట కేశ దుర్గా భవాని జన్మదిన సందర్భంగా మానసిక వికలాంగులకు బుధవారం అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. మానసిక వికలాంగుల మధ్య తన పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట సుబ్బమ్మ, ప్రతాప్ నాయుడు, రాఘవేంద్ర నాయుడు, భవాని హని, అబ్దుల్ రహిమాన్, నెమలిగుండం, నాయబ్ రసూల్, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా వరి ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర-దొనకొండ: రైతులు పండించిన వరి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు విషయమై చందవరం, రామాపురం గ్రామాల రైతులతో ఏఓ లక్ష్మీనారాయణ బుధవారం సమావేశమయ్యారు. 2022 ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యం సాధారణ రకం 100 కేజీలు రూ.2040, గ్రేడ్-ఏ రకం రూ.2060 చొప్పున ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. చెత్తా చెదారాలు, మట్టి పెళ్ళలు, వ్యర్థ పదార్థాలు 1 శాతం, తేమ లేక నెమ్ము 17 శాతం, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం 5 శాతానికి మించకుండా నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. ఈ క్రాప్‌లో నమోదై, ఈకేవైసీ చేయించుకున్న రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రగిరి రాణి సాల్మన్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గుమ్మా వెంకటేశ్వర్లు, విఏఏలు పి.సురేంద్ర, క్రిష్ణారెడ్డి, విన్నీబాబు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకే ఫ్యామిలీ ఫిజీషియన్

వైద్య పరీక్షలు చేస్తున్న ప్రవీణ్ కుమార్

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ పథకం ప్రవేశ పెట్టిందని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని పూరిమెట్ల గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ పథకంలో 104 వాహనం ద్వారా వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం 104 వాహన ద్వారా 67 రకాల మందులు14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని డాక్టర్ వైయస్సార్ క్లినిక్‌లో 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో ఏడుగురికి సాధారణ జలుబులు దగ్గులు ఉన్నట్లు గుర్తించి వారికి మందులు అందజేశారు. ఏఎన్ఎం సుధా104 డీఈవో వెంకట ప్రసాద్, సిహెచ్ఓ లక్ష్మి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరును టీడీపీకి కంచుకోటగా మార్చాలి

- 2024లో తిరుగులేని మెజార్టీతో గెలుపొందాలి
- రెట్టింపు ఉత్సాహంతో పార్టీ కార్యక్రమాలను చేపట్టాలి
- అన్నీ క్యాడర్ల నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి
- గిద్దలూరు ఇన్‌చార్జి ముత్తుముల అశోక్ రెడ్డితో 'ముఖా ముఖి'లో అధినేత చంద్రబాబు
- అశోక్‌రెడ్డి పనితీరుపై కితాబు

విశాలాంధ్ర - గిద్దలూరు : 2024 ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీతో గెలుపొందాలని గిద్దలూరు ఇన్‌చార్జి ముత్తుముల అశోక్ రెడ్డికి పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బుధవారం మంగళగిరిలోనే జాతీయ పార్టీ కార్యాలయంలో గిద్దలూరు నియోజకవర్గ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డితో 'ముఖాముఖి'లో చంద్రబాబు గిద్దలూరు నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు తదితర అంశాలపై చర్చించారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించేలా ఇప్పటి నుండే కృషి చేయాలని సూచించారు. అన్నీ క్యాడర్ల నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగా లన్నారు. ఇప్పటికే గిద్దలూరు నియోజక వర్గంలో టిడిపిపై ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. ప్రత్యర్థి తీరుపై నియోజకవర్గ ప్రజలంతా అసంతృప్తిగా ఉన్నారని తెలుస్తోందన్నారు. ఈ క్రమంలో టీడీపీ ఇంకా బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయి నుండి టిడిపిని పటిష్టం చేసేందుకు క్యాడర్ పని చేయాలన్నారు. అన్నీ క్యాడర్ల నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. అలాగే పార్టీ సభ్యత్వంపై ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. బూత్ స్థాయి కమిటీలు అన్నీ డివిజన్లలో నియోజకవర్గ కార్యకర్తలు అందరూ సమన్వయంతో పార్టీ బలోపేతం కోసం పని చేయాలన్నారు. ఇప్పటి వరకు పార్టీ కార్యక్రమాలను గిద్దలూరు నియోజక వర్గంలో విజయవంతంగా నిర్వహించారన్నారు.

ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో కూడా పని చేయా లన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లో తీసుకెళ్లి, ప్రజల్లో మనోధైర్యం నింపాలన్నారు. నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ సమస్యలపై పోరాడాలన్నారు. రానున్న ఎన్నికల్లో గిద్దలూరు నియోజక వర్గం టీడీపీకి కంచుకోటగా మార్చాలని చంద్రబాబు నాయుడు ముత్తుములకు సూచించారు.

పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండవ వైద్యాధికారి

విశాలాంధ్ర-జెపంగులూరు : గత నాలుగు సంవత్సరాలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిడిఓగా బాధ్యతలు నిర్వహించి, ఒంగోలు రిమ్స్‌కి డాక్టర్ చంద్రశేఖర్ ట్రాన్స్‌ఫర్ అయ్యారు. అతని స్థానంలో క్రొత్తగా డాక్టర్ శివ చెన్నయ్య బాధ్యతలు స్వీకరించారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి పాటు పడ్డారు. చర్మవ్యాధుల డాక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మండల పరిధిలోని రోగులే కాకుండా ప్రక్క మండలాల నుంచి కూడా రోగులు వచ్చేవారు. ఓపి పెంచి, హాస్పిటల్‌కి మంచి గుర్తింపు తెచ్చినందుకు డాక్టర్ చంద్రశేఖర్‌ను, ఆసుపత్రి సిబ్బంది అభినందించారు. డాక్టర్ శివ చెన్నయ్య రోగులకు సేవ చేస్తారని తెలిపారు.

జగన్‌లో రోజురోజుకు అభద్రతా భావం

- నరసాపురంలో సీఎం జగన్ కార్యక్రమంలో మహిళల చున్నీలను తీయించడం దారుణం
- బురఖాలు వేసుకున్న మహిళలను సభలోకి రానివ్వరా?
- ఒంగోలు నియోజకవర్గ టీడీపీ మహిళా నాయకుల ప్రశ్న

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు మహిళానాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : ముఖ్యమంత్రి జగన్‌లో రోజురోజుకు అభద్రతా భావం పెరిగి పోతుందని ఒంగోలు నియోజక వర్గం తెలుగు మహిళా నాయకులు ఎద్దేవా చేశారు. స్థానిక టిడిపి ఒంగోలు నియోజక వర్గం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మొన్న నరసాపురం ముఖ్యమంత్రి సలో మహిళల చున్నీలు తీయించటం దారుణమన్నారు. బురఖాలు వేసుకున్న మహిళలను సభలోకి రావివ్వకపోవటం వారిని అవమానించినట్లే అన్నారు. నరసాపురంలో నిన్న ముఖ్యమంత్రి జగన్ కార్యక్రమం జరిగిన సంగతి తెలిసిందే అన్నారు. ఇప్పటికే పరదాలు, బ్యారికేడ్ల మధ్య పర్యటనలకు వెళ్తున్న ముఖ్యమంత్రి నల్లరంగులో ఉన్నాయని తన సభకు వచ్చిన మహిళల చున్నీలను కూడా తీసివేయించడం దారుణమని అన్నారు. బురఖాలు వేసుకున్న ముస్లిం మహిళలను సభలోకి రానివ్వరా? అని మహిళా నాయకులు ప్రశ్నించారు. గొడుగులు చూసి కూడా ఎందుకు భయమని అడిగారు. రాష్ట్ర మహిళా నాయకులు కుసుమ కుమారి, ఆళ్ల వెంకటరత్నం, నరసమ్మ, అనంతమ్మ, పార్లమంట అధ్యక్షులు రావుల పద్మజ, అరుణ రెడ్డి, రత్నకుమారి పాల్గొన్నారు.

ప్రతి ఒక్క రైతు 'ఈ-క్రాప్' చేయించాలి

పంటలను పరిశీలిస్తున్న ఖాదర్‌బి బుజ్జి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని కోవిలంపాడు పంచాయితీలోని రైతులు పంటలు సాగు చేసుకుంటున్న ప్రతి ఒక్క రైతు ఈ-క్రాప్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోవిలంపాడు సర్పంచి షేక్ ఖాదర్‌బి బుజ్జి కోరారు. బుధవారం కోవిలంపాడు పంచాయితీలోని రైతు భరోసా కేంద్రంలో జరిగిన రైతు సదస్సులో సర్పంచి మాట్లాడుతూ రైతులకు రావలసిన సబ్సిడీ విత్తనాలు, పంట నష్టపరిహారానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాలంటే ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలను, ఎరువులను సకాలంలో రైతులకు అందజేయాలని ఆయన సచివాలయ సిబ్బందికి సూచించారు. రైతుకు సంబంధించిన ఏవైనా సేవలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని ఆయన రైతు భరోసా కేంద్రం సిబ్బందికి సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి స్థానిక శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థలో పంచాయితీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సర్పంచి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వరరెడ్డి, గ్రామస్తులు పాలపర్తి నారాయణరావు, చావా వెంకటేశ్వర్లు, సిబ్బంది హరీష్, ఆనంద్ ప్రభాకర్, అబ్దుల్‌బాలెరంతు, ప్రసాదు, నాయిబ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించండి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఊరికి చివరి ఉన్న డంపింగ్ యార్డ్ వద్ద ఎస్టి కులానికి చెందిన 30 కుటుంబాల వారు గత కొన్ని నెలలుగా గుడిసె వేసుకొని జీవిస్తున్నారు. వారికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని జడ్పిటిసి తాతపూడి మోజెస్ రత్నం రాజు, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ మొబిలైజర్ గోపనబోయిన వెంకటరావుకు తెలుపగా వారు ఎస్టీ కాలనీ గుడిసెల దగ్గరకు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఆ గుడిసెలకు విద్యుత్ సౌకర్యం లేక విష జంతువుల మధ్య కాలం వెలదీస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ ఏఈ జె. భూరాజుతో కలిసి గుడిసెల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఆ కాలనీకి 15 కరెంటు పోల్స్ ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సుమారు రెండు లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు. అవసరమైతే నా సొంతంగా 10000 రూపాయలు ఇస్తానని తెలిపారు. జడ్పిటిసి మోజస్ రత్నంరాజు ఈ సమస్యను ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దృష్టికి తీసుకువెళ్లి. కరెంటు త్రాగునీటి వసతి కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టి కాలనీవాసులు పాల్గొన్నారు.

పనితీరు భేష్

- నేరాల నియంత్రణలో మరింత కృషి
- హత్య దొంగతనం కేసును ఛేదించిన శింగరాయకొండ పోలీసులు
- పోలీసులకు డీఐజీ త్రివిక్రమ వర్మ అభినందన

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ త్రివిక్రమవర్మ

విశాలాంధ్ర - శింగరాయకొండ : నేరాల నియంత్రణలో విశేషంగా కృషిచేస్తున్నందుకు శింగరాయకొండ పోలీసు సిబ్బందికి డిఐజి త్రివిక్రమ వర్మ ప్రశంసలు లభించాయి. హత్య, దొంగతనం కేసులో శింగరాయకొండ పోలీసులు చూపించిన చాకచక్యానికి అభినందించడంతో పాటు, ఆకేసు వివరాలను తానే స్వయంగా విలేకరుల సమావేశంలో వివరించి ఎస్పీ మల్లికాగర్గ్, అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఎస్‌వి శ్రీధరరావు,డిఎస్పీ నాగరాజు, సిఐ రంగనాథ్, ఎస్ఐ ఫాతిమాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

శింగరాయకొండ పోలీసుస్టేషన్‌కు సాధారణ తనిఖీ నిమిత్తం వచ్చిన ఆయన అనంతరం నేరాల నియంత్రణలో పోలీసుశాఖ చేస్తున్న కృషి వివరిం చారు. నేరాలు ప్రమాదాలు తమ శాఖ అధికారుల చొరవ వలన తగ్గుముఖం పడుతున్నా యని ప్రశంసించారు. రౌడీషీటర్లపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని, అన్ని ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వేగవంతంగా కేసులను ఛేధించడంలో విశేష ప్రతిభ చూపిన పోలీసు ఉద్యోగులను ఆయన అభినందించడంతో పాటు ప్రత్యేక రివార్డులు అవార్డులతో ఆయన అభినందించారు. డిఐజి వెంట ఎస్పీ మల్లికాగర్గ్ ఇతర అధికారులు శింగరాయకొండ పోలీసు స్టేషన్‌ను బుధవారం సందర్శించారు.

పదిరోజుల్లోనే కేసుకు పరిష్కారం

స్థానిక గంజివారి కళ్యాణమండపం సమీపంలో వారం రోజుల క్రితం జరిగిన హత్య దొంగతనం కేసును శింగరాయకొండ పోలీసులు ఛేధించారు. ఈ కేసులో మొత్తం 32 మంది అనుమానితులను విచారించారు. ఒక్కపైసా కూడా నష్టం జరగకుండా రికవరీ చేయగలిగారు. మొత్తం 76గ్రాముల బంగారాన్ని పోలీసులు రికవరీ చేయగలిగినట్లు డిఐజి త్రివిక్రమ వర్మ ప్రకటించారు. గంజివారి కళ్యాణమండపం సమీపంలో నివాసం ఉంటున్న నారాయణమ్మ(65) ఇంటిలో అడకా వరలక్ష్మి, అడకా అశోక్(తల్లీకొడుకులు) అద్దెకు దిగారు. ఒంటరిగా నివాసం ఉంటున్న నారాయణమ్మ ఆర్థిక లావాదేవీలపై కన్నేశారు. ఇటీవలే బ్యాంకు నుండి నగలు తీసుకొచ్చిన విషయాన్ని గమనించిన తల్లీకొడుకులు మరికొందరు సహకారం తీసుకుని ఈనేరానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. అడకా అశోక్ రాత్రి వేళ వెనక నుండి గోడదూకి ఇంటిలోకి వెళ్ళి నగలు తీసుకోవాలని ప్రయత్నిం చాడు. అయితే నారాయణమ్మ పెద్దగా అరవడంతో ఆమెను హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ వ్యవహారంలో వీరిరువురికి మొహమ్మద్ జాఫర్, పరుసు సందీప్, గొల్లపూడి వరలక్ష్మి , చిడితోటి రాజశేఖర్ అనే వారు సహకరించినట్లు పోలీసులు నిర్ధారించారు. కేవలం వారం రోజుల్లో ఈకేసును ఛేదించడం పట్ల డిఐజి ప్రశంసించారు. కేసుల ఛేదనలో శింగరాయకొండ పోలీసులు చేసిన కృషికి అభినందనలు తెలిపిన డిఐజి అడిషనల్ ఎస్పీ శ్రీధరరావు, డిఎస్‌పి నాగరాజు, సిఐ రంగనాథ్, ఎస్ఐ ఫిరోజా ఫాతిమా, జరుగుమల్లి ఎస్ఐ వెంకటేశ్వరరావు, జరగుమల్లి ఎస్ఐ వెంకటేశ్వ రరావు, టంగుటూరు ఎస్ఐ ఖాదర్‌భాషాతో పాటు సిబ్బందికి రివార్డులు అందించారు.

సీఐ రంగనాద్‌ను ప్రశంసిస్తున్న డీఐజీ

ఎస్ఐ ఫాతిమాకు ప్రశంసాపత్రం అందిస్తున్న డీఐజీ

మిరపలో బొబ్బర తెగులు నివారించాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : మిరప పంటలో బొబ్బర తెగులు నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్‌రావు అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం ఆయన కొర్రపాటివారిపాలెం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మిరప పంట పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కలిగిస్తూ ప్రస్తుత వాతావరణంలో బొబ్బర తెగులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉందని దీని నుండి బయటపడడానికి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. తెల్ల దోమ ద్వారా వ్యాప్తి చెంది వాతావరణంలో అధిక తేమ, వర్షాలు అధికంగా కురవడం వల్ల ఈ తెగులు వ్యాపించి ఆకుల రసం పీల్చడంతో ఆకులు గిడగబారి, పూత రాకుండా దిగుబడి కూడా తగ్గుతుందని ఆయన సూచించారు. దీని నుండి బయట పడాలంటే రైతులు మిరప పంట పొలాలకు చుట్టూ పచ్చ రంగు జిగురు అట్టలను ఎకరాకు 20 చొప్పున ఉంచాలని తెలిపారు. అదేవిధంగా బంతిపూల మొక్కలను ఎకరాకు 50 చొప్పున గట్లపై పెరిగేటట్లు చూడాలని ఆయన తెలిపారు. ఈ నివారణ చర్యలను పాటించి నట్లయితే తెల్ల దోమ నుండి బొబ్బర తెగులు నివారించవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నాగరేణు

విశాలాంధ్ర - నాగులుప్పలపాడు : మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో ఎమ్మెల్యే నిర్వహించిన గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో నిరసన తెలిపిన ఘటనకు సంబంధించి 23 మంది వైసీపీ కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. వీఆర్వో పాలపర్తి కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసులో నక్కల నాగరేణుతో పాటు మరో 22 మంది ఉన్నారు. అయితే వీరందరూ అధికార పార్టీకి చెందినవారు కావడంతో సుమారు వారం రోజులు తర్జనభర్జనలో హై డ్రామా అనంతరం నిందితులలో కొందరికి 41 నోటీసులు ఇచ్చి ఇంటికి పంపించారు. అయితే అనూహ్యంగా నక్కల నాగరేణును మంగళవారం రాత్రి డి.ఎస్.పి ఆఫీస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌లోనే ఉంచారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని 24 గంటలు గడిచినప్పటికీ నక్కల నాగరేణును కోర్టుకు హాజరపరచలేదు. అయితే నాగరేణు తరపున హైకోర్టు లాయర్ వచ్చి కేసు వివరాలు అడిగినట్లు తెలిసింది. అయినప్పటికీ పోలీసుల నుండి పూర్తి సమాచారం రాలేదు. ఒమ్మెవరం గ్రామంలో జరిగిన ఘటనలో పోలీసులు దూకుడుగా వ్యవహరించాలని అభియోగంపై ఎస్ఐ వైవి రమణయ్యను ఎస్‌బికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఇక నాగరేణును అదుపులోకి తీసుకున్నప్పటికీ కోర్టుకి సబ్మిట్ చేయకపోవడంపై నాగరేణు మద్దతు దారులు పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం అక్కపల్లె గ్రామ సమీపంలో ఆగి ఉన్న ఆటోను వెనక నుండి ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గిద్దలూరు పట్టణంలోని వైద్యశాలలో స్థానికులు చేర్పించి వైద్యచికిత్సలు నిర్వహించారు. తాటిచెర్ల మోటులో మెకానిక్‌గా పనిచేస్తూ రాత్రివేళ కొమరోలులోని ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

'ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-అద్దంకి : డిసెంబరు 1నుండి జరగబోయే ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చీరాల తెదేపా ఇన్‌చార్జి యం.యం.కొండయ్య తెలుగుదేశం పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. తెదేపా జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు గారి ఆదేశాల మేరకు జగన్‌రెడ్డి పాలనలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంపై పట్టణంలోని కామేపల్లి కళ్యాణమండపం నందు బాపట్ల పార్లమెంట్ పరిధిలోని అద్దంకి,చీరాల,సంతనూతలపాడు,పర్చూరు నియోజకవర్గాలకు చెందిన తెదేపా క్లష్టర్,యూనిట్,ఇంచార్జిలతో బుధవారం వర్క్‌షాప్ జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యం,యం,కొండయ్య మాట్లాడుతూ ఇదేమి ఖర్మ-మన రాష్ట్రానికి అని ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమం ప్రతి ఇంటింటికి తెలిపి ప్రజలను చైతన్య పరచి తెదేపా అధికారంలోకి తీసుకురావలసిన ఆవశ్యకతను వివరించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే ప్రజలకు విముక్తి కలుగుతుందన్నారు.పార్టీ నేతలంతా సమిష్టి బాధ్యత తీసుకుని ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

విశాలాంధ్ర-పెద్దారవీడు : తెలుగుదేశం పార్టీ యర్రగొండపాలెం, మార్కాపురం మరియు గిద్దలూరు నియోజకవర్గాల యూనిట్, క్లస్టర్ ఇంచార్జిల వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం యొక్క శిక్షణ తరగతులు యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు మండలంలోని దేవరాజు గట్టు గ్రామంలో గల గంగరాజు కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రవీంద్ర విచ్చేసి యూనిట్ ఇన్చార్జిలకు, క్లస్టర్ ఇంచార్జిలకు దిశా నిర్దేశం చేశారు. మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీలో బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్, యూనిట్ ఇంచార్జ్, క్లస్టర్ ఇంచార్జిల రూపంలో నాలుగించల వ్యవస్థ ప్రవేశపెట్టారని, వీరిలో ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు రావటం వచ్చునని వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వీరందరూ ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. గత ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చిన ఒక సంవత్సరంలోనె వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు మడమ తిప్పి అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాల తర్వాత కూడా ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారని తద్వారా పశ్చిమ ప్రకాశం ప్రజలను నిలువునా ముంచారని తెలిపారు. వాస్తవ పరిస్థితులు ఆలోచించిన ప్రజలు ఇప్పుడు ఈ వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇదేం ఖర్మ మన పశ్చిమ ప్రకాశానికి అని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జిల్లాల పునర్విభజన విషయంలో తెలుగుదేశం పార్టీ మరియు ఇతర పార్టీలు రెండు నెలలు పోరాటాలు చేసిన మీదట కూడా వైసిపి నాయకులు చివరికి మార్కాపురంను జిల్లా చేయకుండా స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బలి పశువును చేశారని, ఒకవేళ మార్కాపురం జిల్లా వచ్చినట్లయితే ఈ ప్రాంత రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు, వ్యాపారులు బాగా అభివృద్ధి చెందే వారిని అందరి నోట్లో వైసీపీ నాయకులు మట్టి కొట్టారని ఆవేదన వెళ్లబుచ్చారు. త్వరలోనే మార్కాపురం ప్రత్యేక జిల్లా సాధన విషయంలో అందరి సహకారంతో తిరిగి ఉద్యమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తామని తెలిపారు. ఈ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో స్పష్టముగా వ్యతిరేకత వ్యక్తం అవుతుందని ముఖ్యంగా ప్రతి తెలుగుదేశం కార్యకర్త నుండి క్లస్టర్ ఇన్చార్జి వరకు ప్రతి ఒక్కరు కష్టపడి పని చేసి ఈ దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని తద్వారా తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కాపురం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ కందుల రామిరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పక్కలగడ్డ మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, వివిధ నియోజకవర్గాల మండల పార్టీ అధ్యక్షులు, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు, క్లస్టర్ ఇన్చార్జిలు, బూత్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఎంపీపీ సుంకర సునీత

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర సునీత

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మారెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో కే కుసుమ కుమారి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను ఎంత మేర పరిష్కరించారో ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీటిసి తాతపూడి మోజేష్ రత్నం రాజు మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజలు సచివాలయాలకు. మండల కార్యాలయాలకు వెళ్ళినప్పుడు అధికారులు వారి సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పలు రకాల పథకాలను అధికారులు అర్హులైన వారందరికీ అందెల చూడాలన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే వారిని గుర్తించి వారికి పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. గ్రామాల లోని సమస్యలు పెండింగ్ లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఉషారాణి. పశువైద్యాధికారిని ఎం విజయలక్ష్మి. మారెళ్ళ ముళ్ళమూరు వైద్యాధికారులు వి జ్యోతి, బి మధు శంకర్, ఎంఈఓ చంద్రమోహన్, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, వ్యవసాయ అధికారిని ఎన్ మేరమ్మ, ఏపీవో కొండయ్య, ఏపీఎం హనుమంతరావు, అంగన్వాడి సూపర్వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు

ఈ పంట నమోదు పత్రాలను అందజేస్తున్న వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఖరీఫ్ లో రైతులు సాగు చేసిన వరి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి కే.ప్రసన్న రంగ లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కాట్రగుంట తువ్వపాడు గ్రామాలలోని రైతులకు సమీక్ష సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతుల అమ్ముకోవచ్చు అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల మేరకు 100 కేజీల బస్తా ఒకటో రకం రూ2060 లు రెండవ రకం రూ 2040 రేటుతో కొనుగోలు చేస్తారని ఈ క్రాఫ్ ఈ కేవైసీ నమోదు చేయించుకుని ఉండాలన్నారు. ఆ గ్రామాల్లోని రైతులకు ఈ పంట నమోదు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు శిరీష, సాయి లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్

విశాలాంధ్ర-పామూరు : ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సంక్షేమమును అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు, టిటిడి పాలకమండలి సభ్యులు, కనిగిరి శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ అన్నారు. బుధవారం సాయంత్రం సభలో ఆయన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ బలహీన వర్గాల అభివృద్ధికి నావంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. రైతు ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంటగాని పేతురు మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులపై నిరంతరము పోరాడుతున్నామన్నారు. ప్రకాశం జిల్లా అధ్యక్షులు బద్దిపూడి మార్క్, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు సూరిపోగు మాల్యాద్రి, జిల్లా యూత్ అధ్యక్షులు జగన్నాథం మల్లిఖార్జున, కనిగిరి డివిజన్ అధ్యక్షులు కోమారి ఇశ్రాయేలు, కావలి డివిజన్ అధ్యక్షులు స్వర్ణమోహన్, సిఎస్‌పురం మండల అధ్యక్షులు బలభద్ర రవి, వెలిగండ్ల అధ్యక్షులు బద్దిపూడీ సుందర రావు, వరికుంట పాడు మండల అధ్యక్షులు చేవూరి ఫిలిప్, పామూరు మండల అధ్యక్షులు మల్లెల రాజారావు, కొండాపురం మండల అధ్యక్షులు అరిగేల కొండయ్య, పామూరు మండల వైస్ ప్రెసిడెంట్ అంకె దానమయ్య, మురారి మాధవ్, బెజావాడ బాల కాశయ్య బెజావాడ గంగయ్య, సురిపోగు ఆదాము, సురిపాగు చిన్న శివరామయ్య, కొలకాని దేవయ్య, అంకె జేమ్స్ పాల్గొన్నారు.

డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-పెద్దారవీడు : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నందు డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న స్వప్న పుట్టినరోజు వేడుకలను స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ మానసిక రుగ్మత ఆశ్రమం నందు బుధవారం కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ మానసిక రుగ్మతగల పిల్లలకు భోజన సదుపాయం కల్పించి ఎటువంటి కల్మషం లేనటువంటి పిల్లలను ఆశీర్వదించి వారి మధ్యన పుట్టినరోజు వేడుకలు జరుపుకొని వారి యొక్క చల్లని దీవెనలు శుభాభినందనలు తీసుకోవడం ఎంతో చాలా ఆనందంగా ఉందని స్వప్న తెలిపారు. అలాగే నిత్యం పుట్టినరోజు మరియు పెళ్లిరోజు ఏదైనా సందర్భంగా ఖర్చు చేసే దానిలో కొంత భాగం ఇటువంటి వారికి ఉపయోగిస్తే ఆ దేవుని చల్లని దీవెనలు ఎల్లప్పుడూ తమపై ఉండి నిండు నూరేళ్లు, ఆయుఆరోగ్యాలు, సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారని తెలియజేసినారు. ఈ మహోన్నతమైన సేవా కార్యక్రమానికి భోజనం సదుపాయం కల్పించిన స్వప్నకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇలాగే దాతలు నిత్యం ఆర్థిక సహాయ సహకారాలు అందించినచో భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెూంగార్డు చెన్నుపల్లి కాశయ్య తెలిపారు. ఎవరైనా దాతలు ఆర్థిక సహాయం అందించాలన్నచో 9603580633 నెంబర్ ని సంప్రదించవలసినదిగా కోరారు. ఈ సేవా కార్యక్రమంలో స్వప్న, మరియదాసు, కాశయ్య మరియు స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని ముటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమునాలను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారా లేదా వంట గది వద్దకు వెళ్ళి వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆ సమయంలో ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ ఉన్నారు.

వీఆర్వోల సంఘం మండల అధ్యక్షులుగా కోటేశ్వరరావు

విశాలాంధ్ర-దుర్గి : గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండల అధ్యక్షుడుగా దుర్గి వీఆర్వో టి.కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఆరుముళ్ళ నాగేశ్వరరావు ప్రకటించారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోల నూతన కార్యవర్గ సమావేశం ఎన్నికల అధికారి ఆరుముళ్ళ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా ఎస్.కోటేశ్వర రావు (ఆత్మకూరు), కార్యదర్శిగా కె.రత్నప్రకాష (కోలగుట్ల), సంయుక్త కార్యదర్శిగా షేక్ జానీబాష(అడిగొప్పల), కోశాధికారిగా ఎం.సునీత (ముటుకూరు)లు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కడియం రాజు, ఆర్ఐ వాణి, సీనియర్ అసిస్టెంట్ నిర్మల, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వీఆర్వోలు రంగారావు, కిరణ్‌లు ఉన్నారు.

దీపాలతో భారీ శివలింగం

విశాలాంధ్ర- వినుకొండ : స్థానిక బోస్‌బొమ్మ సెంటర్‌లో గల శ్రీ సమర్థ సద్గురు షిరిడి సాయిబాబా వారి మందిరం ఆవరణలో కార్తీక మాసం సందర్భం గా బుధవారం 30 అడుగుల వెడల్పు 60 అడుగుల పొడవు శివలింగమును భక్తులచే 6000 ప్రమిదలతో ఒక్కొక్క ప్రమిదకు పది వేల వత్తులతో కట్టతో దీపములు మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొని వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడారు. ప్రముఖ ఆర్టిస్ట్ బి.ప్రసాద్ ఎంతో సమకోర్చి భారీ శివలింగం చిత్రీకరించిన ఆయనను ఘనంగా సత్కరించారు.

చీరాల మరింత అభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర-చీరాల : పార్వతి పరమేశ్వరుల యొక్క కృపాకటాక్షాలు ప్రజల మీద ఉండి, చీరాల ప్రాంతం మరింత అభివృద్ధి సాధించి అన్ని రంగాల్లో ముందు ఉండేందుకు శివపార్వతుల ఆశీస్సులు ఉండాలని కోరుకున్న చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. కార్తీకమాస అమావాస్య సందర్భంగా వార్షిక లక్ష బిల్వర్చన కార్యక్రమం పేరాల శివాలయం శ్రీ గంగ భ్రమరాంబ సమేత శ్రీ పునుగు రామలింగ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి గణపతి పూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వర్చన, సాయంత్రం నుండి అమ్మవారి దగ్గర కుంకుమ అర్చన, ఆకాశదీపం మరియు మంత్ర పుష్పం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పూజా కార్యక్రమంలో పాల్గొని నూతనంగా నిర్మించిన ప్రాకారం మండపమును ప్రారంభించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కరంచేటి రాజశేఖర్ శర్మ నగేష్, రాము, మస్తాన్, అమర్నాథ్ శర్మ, చక్రవర్తి, సాయి కృష్ణ, సుబ్బయ్య, రవీంద్ర, విట్ట వెంకట్, హర్ష వర్ధన్, దేవాలయ పాలకమండలి చైర్మన్ గోలి శ్రీనివాసరావు కమిటీ సభ్యులు సంక మురళీకృష్ణ, బలగం శెట్టి అంకమ్మరావు, గంజి పార్వతి, ప్రకార మండప నిర్మాణ దాతలు కొర్నిపాటి శ్రీనివాసరావు, విమల, మేనేజర్ శివ నాగదాసు, అన్నదాత మరియు శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డా,తాడివలస దేవరాజు, గోలి రవి, గోలి స్వాతి పాల్గొన్నారు.

నిత్య జీవితంలో సైన్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-మార్కాపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం కమల స్కూల్లో నిత్య జీవితంలో సైన్స్" అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో దోర్నాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షేక్ షావలి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ అంశాలను పరిగణలోకి తీసుకుంటూ, భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. జనవిజ్ఞాన వేదిక డివిజన్ కార్యదర్శి ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో సైన్స్ అంశాలను పాటిస్తూ, మూఢనమ్మకాలను పారద్రోలాలన్నారు. అనంతరం చెకుముకి సైన్స్ సంబరాల పరీక్షలో విజేతలుగా నిలిచిన కమలా స్కూల్ టీం విద్యార్థులైన జి.ప్రజ్వల, వి.స్రవంతి, ఆర్.అభిలాష్‌రెడ్డిలకు బహుమతులను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమల స్కూల్ పాఠశాల ప్రిన్సిపల్ పి.పుల్లయ్య, ఉపాధ్యాయులు గుండారెడ్డి నారాయణరెడ్డి, మాధవీలత, ఓ.రామాంజనేయులు, మండ్లా సాయిబాబు పి.జీవనంద్, షేక్ ఖాసింబి తదితరులు పాల్గొన్నారు.

పల్లె సంప్రదాయలకు ప్రతీక ఎడ్ల పోటీలు

విశాలాంధ్ర-కారంపూడి: పల్లె సాంప్రదాయాలకు ఎడ్ల పోటీలు ప్రతీకగా నిలుస్తాయని మాచర్ల శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొ న్నారు. బుధవారం పలనాటి వీరారా ధన ఉత్సవాలలో మొదటిరోజైన రాచగావున జాతీయ ఎడ్ల బండలాగుడు పోటీలను శాసనసభ్యులు ప్రారంభించారు. తొలుత పట్టణంలోని వీర్ల అంకాళమ్మ, చెన్నకేశవస్వామి, వీరుల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం పోటీల ప్రాంగణం వద్ద కొబ్బరి కాయ కొట్టి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సీఎం సభ వద్ద పోలీసుల అత్యుత్సాహం

విశాలాంధ్ర- వినుకొండ: నరసాపురంలో సీఎం సభ వద్ద పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారని నల్ల దుస్తు లు, నల్ల చున్నీలు వేసుకున్న వారిని అనుమతించకపోవడం సిగ్గుచేటని, మహిళలకు జరిగిన అవమానాన్ని ఖండిస్తున్నామని టీడీపీ మహిళా నాయకులు అన్నారు. ఉదయం వర్షం కురవడంతో నలుపు రంగు రైన్ కోట్లు వేసుకొచ్చిన వారిని అవి తీసి పక్కన పెట్టి లోపలికి వెళ్లాలని అక్కడ ఉన్నటువంటి అధికారులు ఆదేశించారు ఎప్పుడు చూడలేని సంస్కృతి వైసీపీ ప్రభుత్వంలో మహిళలు చూడాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు మన్నం ఆదిలక్ష్మి, వినుకొండ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ముప్పూరి చౌడమ్మ, వినుకొండ టౌన్ తెలుగు మహిళా అధ్యక్షురాలు బొట్లగుంట లక్ష్మీ ,మరియు ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు తుమ్మ వెంకట కోటమ్మ తమ్మిశెట్టి ఈశ్వరమ్మ గుమ్మడిదల శివ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: అర్హులైన వారందరికి బ్యాం కుల నుంచి రుణాలు ఇవ్వా లని గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ యూనియన్ బ్యాంక్ గుంటూరు బ్రహ్మానందకుమార్ అన్నారు. స్థానిక ఐసిడియస్ కార్యాలయంలో ఫిరంగిపురం, మేడి కొండూరు, గుంటూరు రూరల్ యూనియన్, యస్‌బిఐ బ్యాంకుల అధికారులతో జాయింట్ మండల లెవల్ బ్యాంకర్స్ కమిటీ మీటింగ్ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డైరెక్టర్ బ్రహ్మానందకుమార్ మాట్లాడుతూ అర్హులైన వారందరికి అనగా రైతులకు, డ్వాక్రా సంఘాలకు, నమ్మకమైన ఖాతాదారులందరికి రుణాలు మంజూరు చేసి వివిధ వృత్తులకు సంబంధించి ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా చర్యలు చేపట్టి బ్యాంకుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన పథకం క్రింద నమోదైన ఖాతాదారులు సంవత్సరానికి రు.436లు ప్రీమీయం చెల్లించిన వారికి ఈ పథకంలో నమోదైన ఖాతాదారుడు మరణిస్తే రు.2లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ భీమా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఫిరంగిపురం యూనియన్ బ్యాంక్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఇ.రాధిక, యస్‌బిఐ చీఫ్ మేనేజర్ సిహెచ్. ఆనందకుమార్ పాల్గొన్నారు.

షాపులను తనిఖీ చేసిన తూనికలు కొలతలు శాఖా అధికారులు

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో గల షాపులను బుధవారం తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీ చేశారు. తూనికలు కొలతల శాఖ ఇన్ స్పెక్టర్ ఎస్.అల్లూరయ్య ఆధ్వర్యంలో గ్రామంలో బేకరీ షాపులను, కిరాణా దుకాణాలను, హెూటళ్లను, తనిఖీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా తూనికలు కొలతలు శాఖ ఇన్ స్పెక్టర్ అల్లూరయ్య మాట్లాడుతూ షాపులలో వినియోగదారులకు సరుకులు ఇచ్చేటప్పుడు నిష్పక్షపాతంగా కాటా వేసి ఇవ్వాలని అన్నారు. షాపుల యజమానులు సరుకుల వినియోగానికి ఉపయోగించే కాటాకు ప్రభుత్వం నుండి లైసెన్స్ పొందాలని అన్నారు. షాపులలో ప్రభుత్వం వారి ముద్ర ఉన్న కాటాలను వినియోగించాలని అన్నారు. ఆ విధంగా కాటాలు లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తూనికలు కొలతలు శాఖ సిబ్బంది, షాపు యాజమానులు పాల్గొన్నారు.

రాజమండ్రిలో మహాసభలు జయప్రదం చేయండి

- బత్తుల శ్యామ్యూల్

విశాలాంధ్ర - బాపట్ల : ఈ నెల 26 నుంచి రాజమండ్రిలో జరగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం 7వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ తెలిపారు. బాపట్లలోని ముఠా గోడౌన్ ఆఫీస్ వద్ద బుధవారం గోడ పత్రులు ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 32 వేల పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని సంక్షేమ బోర్డు నుండి ప్రభుత్వం వాడుకొన్న 1200 కోట్లు తిరిగి సంక్షేమబోర్డుకు అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియ్మెజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షులు సన్నమూరి శ్రీనివాసరావు, కార్యదర్శి మామిడి బత్తుల అశోక్, బాపట్ల సీపీఐ నాయకులు జెల్డి బాగ్య శ్రీధర్, ఏఐటీయూసీ నాయకులు ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, పమిడి బోయిన రామాంజనేయులు తదితరులున్నారు.